ప్రజాశక్తి
శనివారం 25 మే 2024
5
పార్వతీపురం మన్యం

కెజిబివి టీచర్ల రెన్యువల్స్ ఆపొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలోని కెజిబివి టీచర్లను పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పేరుతో వారి రెన్యువల్స్‌ను ఆపొద్దని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో నివాసం ఉన్నందుకు 5 పాయింట్లు, క్రమశిక్షణకు 5, అవార్డులకు 5, ఉపాధ్యాయులపై అభియోగాలు లేకపోతే 5 పాయింట్లు ఇలా ఏడాదికి 20 పాయింట్లు కేటయించి రెన్యువల్ జరపక పోవడం అన్యాయమని అన్నారు. కెజిబివి టీచర్లు రాత్రి, పగలు కష్టపడుతున్నారని, మంచి ఫలితాలు వస్తున్నాయని, ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా మహిళేనని, కావున వారిని ఇటువంటి నిబంధనలు పేరుతో ఇబ్బందులు పెట్టడం తగదని, వారందరినీ తప్పక రెన్యువల్ చేయాలని ఆ ప్రకటనలో కోరారు. లేకుంటే యుటిఎఫ్ తరపున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

- ఏజెన్సీలో రాళ్లు తేలిన రహదారులు
- గిరిజనులకు తప్పని డోలీమోతలు
- అర్ధాంతరంగా నిలిచిన రహదారులు

రాళ్లు తేలిపోయిన నౌగూడ రోడ్డు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలోని పలు గ్రామాలకు రహదారులు లేకపోవడంతో గిరిజనులకు నేటికీ డోలీమోతలు తప్పడం లేదు. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందు రహదారి ఉంటేనే ఆ తర్వాత మౌలిక వసతులు కల్పించబడతాయి. నేటికీ రాళ్ల తేలిన రహదారులు ఉండడంతో గిరిజనులు నడిచి అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వెళ్లలేక డోలీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారికి లెక్కల ప్రకారం సీతంపేట ఐటిడిఎలో 27 గ్రామాలకు రహదారుల కోసం ప్రతిపాదనలు పంపారు. మరికొన్ని గ్రామాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు నిధులు లేమితో అర్ధాంతంగా నిలిచిపోయాయి.

మండలంలోని కోడిశ నుంచి కడగండి వరకు రహదారి పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో కనీసం వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి వల్ల సుమారు నాలుగు మండలాల ప్రజలు రాకపోకలు కొనసాగుతాయి. అచ్చెబా నుంచి బడ్డుమాసింగి రహదారి పనులను ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. ఉప్పరజిమ్మి నుంచి జగడుగూడకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కొయ్యలగూడ నుంచి జలుబుగూడ రోడ్డుకు మట్టి పోసి వదిలేయడంతో వర్షానికి అది కొట్టుకుపోయింది. వంభరెల్లి నుంచి సందిగూడ మీదుగా తుంబకొండ వరకు రహదారులు మరమ్మతులకు గురయ్యాయి. జల్లారి నుంచి అంటికొండగూడ బిటి రోడ్డును అర్ధాంతరంగా వదిలేశారు. కుడ్డేపల్లి నుంచి ఈతమానుగూడ, వలగజ్జి సెంటర్ నుంచి సీదిగూడ రహదారి మరమ్మతులకు గురైంది. ముత్యాలు జంక్షన్ నుంచి కొత్తాం రోడ్డు పూర్తిగా రాళ్లు తేలిన రహదారితో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. నడిమి బుడగరాయి నుంచి ఎగువ బుడగరాయి వరకు కిలోమీటరు రహదారి వేయకపోవడంతో ఆ రోడ్డు పూర్తిగా కాలేదు. జక్రవలస సెంటర్ నుంచి కోసమానుగూడ మీదుగా బాలిక ఆశ్రమ పాఠశాల వరకు రహదారి వేయాల్సి ఉంది. నౌగూడకు రోడ్డు లేకపోవడంతో చుట్టుపక్కల మూడు, నాలుగు గ్రామాల ప్రజలతో పాటు పాలిటెక్నికల్ విద్యార్థులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. మర్రిపాడు సెంటర్ నుంచి ఎగువ ద్వారబంధం, మధ్య ద్వారబంధం, రంగంవలస రహదారులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. కీసరిజోడు నుంచి దిగువ కొలవరాయి వరకు మధ్య మధ్యలో సిసి ర్యాంపులు వేసి వేసి అక్కడ నుండి ఎదురువలస నుంచి రోడ్డు లేదు. అలాగే ధారపాడు పంచాయతీ రామానగరం నుంచి పాండ్రకు రోడ్డు వేయాల్సి ఉంది. కోసంగి నుంచి గెద్దగూడకు రోడ్డు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధారపాడు నుంచి దంజిపాయి, గోలుకుప్పగూడ నుంచి జగత్‌పల్లి రహదారి నిర్మించినప్పటికీ తారు రోడ్డు వేయలేదు. కొయ్యలగూడ నుంచి భూతాలగూడ, ధోనిబాయి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి బూర్జిగూడ వరకు చేపట్టిన రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో రానున్న వర్షాకాలంలో కనీసం మనుషులు కూడా అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వైద్యం కోసం రోగిని డోలీపై తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

రోడ్డు లేదు

గ్రామానికి రోడ్డు గ్రావెల్ వేసి కనీసం 10 పదేళ్లు అవుతుంది. దీంతో రాళ్లు పూర్తిగా తేలిపోవడంతో కనీసం నడవడానికి కూడా ఇబ్బంది. అప్పటి ఎమ్మెల్యే సుగ్రీవుల హయాంలో గ్రావెల్ రోడ్డు వేశారు. అప్పటినుండి ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు.

సవర కిరణ్ ,
గిరిజనుడు, నౌగూడ.

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించారు. ఇప్పటికే చాలా గ్రామాలకు రోడ్డు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారుజ అత్యవసర సమయంలో అంబులెన్స్ వెళ్లలేక డోలి మీదే ఆధారపడాల్సి పరిస్థితి నెలకొంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినా స్పందించడం లేదు. తక్షణమే అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు వేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

ఆరిక భాస్కర రావు
సిపిఎం మండల కార్యదర్శి
సీతంపేట మండలం

స్పందనలో వినతులిచ్చాం

నౌగూడ రోడ్డు బాగు చేయాలని సీతంపేట ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో గత ఏడాది అధికారులకు వినతిని ఇచ్చాం. అయినా స్పందించలేదు. ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చిన ప్రయోజనం లేదు.

సవర బోగేష్,
ఉప సర్పంచ్, పెదరామ పంచాయతీ, సీతంపేట మండలం.

రోడ్డు పనులకు చర్యలు తీసుకుంటున్నాం

2021-22లో ఉపాధిహామీ చట్టంలో 50 రహదారులు మంజూరయ్యాయి. 108 రహదారులకు ఇప్పటికీ 29 రహదారులు పూర్తి చేశాం. 40 రహదారులు వివిధ దశలో ఉన్నాయి. 39 రహదారుల ఇంకా ప్రారంభించలేదు. త్వరలోనే ప్రారంభించి పనులు పూర్తి చేస్తాం.

ఎస్ సింహాచలం,
గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
సీతంపేట ఐటిడిఎ.

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

లెక్కింపు కేంద్రంలో పటిష్ట భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అరకు పార్లమెంటరీ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. సాధారణ ఎన్నికల ఓట్లు లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఉద్యాన కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగు నియోజకవర్గాల పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుతో పాటు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన ఏర్పాట్లను, వసతుల కల్పనకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల లెక్కింపు ప్రక్రియ పూర్తికి అవసరమైన ఐరన్ మెస్ బారికేడింగ్ ఏర్పాటును చూశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం, ఎన్నికల సిబ్బంది వచ్చి వెళ్లే మార్గాలను సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి టేబుల్, లెక్కింపు టేబుళ్ల ఏర్పాట్లు, గాలి, వెలుతురు వసతి తదితర అంశాలపై నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారికేడింగ్ పటిష్టంగా ఉండేలా ప్రమాణాలను పాటించాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి పోలీస్ పహారాను చూశారు. అనంతరం బ్యాలెట్ బాక్స్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ సహాయ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం శాసన సభ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులు శుభం బన్సల్, సి.విష్ణు చరణ్, వివి రమణ, కె.హేమ లత, డిఆర్ఒ జి.కేశవనాయుడు, కంట్రోల్ రూమ్ ఎస్‌డిసి ఆర్.సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచార ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొనసాగుతున్న ఏనుగుల గణన

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లాలో ఏనుగుల గణన కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపిప్రసూన తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఏనుగుల జనాభాను అంచనా వేయడానికి మూడు రోజులుగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ గణన ఈనెల 23 న ప్రారంభమైందన్నారు. డబుల్ కౌంటింగ్‌ను నివారించడానికి మూడురోజుల పాటు ఒకే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కసరత్తు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ కసరత్తు జరుగుతోందన్నారు. ఈ అంచనా మానవ-జంతు సంఘర్షణలను అర్థం చేసుకోవడానికి, నియంత్రించడానికి వ్యూహాలను రూపొందించడంలో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అటవీశాఖ సిబ్బంది అందరికీ శిక్షణ ఇచ్చారని, మూడు రోజుల అంచనా వేయడానికి 3 విభిన్న పద్ధతులను ఉపయోగిస్తారన్నారు. మొదటి రోజు బ్లాక్ కౌంట్ పద్ధతిని ఉపయోగించారని, దీనిలో ఏనుగులను ప్రత్యక్షంగా చూసేందుకు 15కిలోమీటర్ల జిగ్‌జాగ్ ట్రాక్‌ను పర్యవేక్షిస్తారు. రెండో రోజు లైన్ ట్రాన్సెక్ట్ పద్ధతిలో పేడ వంటి పరోక్ష సాక్ష్యాధారాల కోసం 2కిలో మీటర్లు, చివరి రోజున వాటర్‌హోల్ పద్ధతిని ఉపయోగిస్తారన్నారు. దీనిలో ఫీల్డ్ సిబ్బంది ఏనుగులను ఉదయం 6:00 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు చూసే అవకాశం ఉన్న వాటర్‌హోల్స్‌ను పర్యవేక్షిస్తారని ఏనుగులను బంధించడానికి కెమెరా ట్రాప్‌లను కూడా ఉపయోగిస్తారని తెలిపారు. ఏనుగులు కదిలే మార్గాలు, ఏనుగుల జనాభా వర్గీకరణ, జనాభా నిర్మాణం, ఏనుగు కారిడార్‌లను రూపొందించడానికి ఆవాసాలను అర్థం చేసుకోవడానికి పై పద్ధతులు తమకు సహాయపడతాయన్నారు. దీనివల్లఏనుగుల సంఘర్షణల తీవ్రతను అంచనా వేయడానికి, తదనుగుణంగా విధానాలను రూపొందించడానికి సహాయపడతాయని తెలిపారు. గతేడాది మేలో ఈ కసరత్తు జరిగిందని, గత ఏడాది అంచనాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఏనుగుల జనాభా 100 నుంచి 120 వరకు ఉంటుందని, ఈ సంవత్సరం మెరుగైన ఆవాస పరిస్థితులు, పరిరక్షణ చర్యల కారణంగా ఏనుగుల జనాభా పెరగవచ్చని భావిస్తున్నారు.

గ్రామీణంలో పెరిగిన ఓటింగ్

- పట్టణంలో తగ్గుముఖం
- గెలుపుపై ఇరుపార్టీల ధీమా

ప్రజాశక్తి -సాలూరు

ఇటీవల ముగిసిన ఎన్నికల పోలింగ్ సరళి చూస్తుంటే గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. దీంతో గెలుపుపై ప్రధాన పార్టీలు ఎవరికి వారే ధీమాతో ఉన్నారు. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లోనూ ఓటింగ్ శాతం పెరగడం చర్చనీయాంశమవుతోంది. సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల్లో 75 శాతం నుంచి 80 శాతం మధ్య ఓటింగ్ నమోదైంది. పాచిపెంట మండలంలో 37116 ఓట్లుకు గానూ 29017 ఓట్లు పోలయ్యాయి. సాలూరు మండలంలో 44727 ఓట్లకు గానూ 35132 ఓట్లు, మక్కువలో 42257 ఓట్లకు గాను 32,238, మెంటాడలో 38,680 ఓట్లకు గాను 31251 ఓట్లు పోలయ్యాయి. సాలూరు పట్టణంలో 42,257 ఓట్లకు గాను 28,693 ఓట్లు పోలయ్యాయి. నాలుగు మండలాలతో పోలిస్తే పట్టణంలో ఓటింగ్ శాతం బాగా తగ్గింది. పట్టణంలో 68శాతం ఓటింగ్ నమోదైంది. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలో ఓటింగ్ శాతం పెరగడంపై వైసిపి శ్రేణుల్లో గెలుపు ధీమా వ్యక్తమవుతోంది. సూపర్స్ సిక్స్ ప్రచారం గ్రామస్థాయిలో విస్తృతంగా జరిగింది. దీంతో తమకు ఓటింగ్ పెరిగే అవకాశాలున్నాయని ఆశాభావంతో ఉన్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ఓటింగ్ శాతం తగ్గడం టిడిపికి నష్టదాయకంగా కనిపిస్తోంది. పట్టణంలోని ఓటర్లపై టిడిపి కూటమి అభ్యర్థి సంధ్యారాణి ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. పట్టణంలో 13016 మంది ఓటర్లు ఓటు వినియోగించుకోలేదు. ఇది టిడిపి నాయకులు కార్యకర్తలను కలవరపెడుతున్న అంశంగా మారింది. పట్టణ ఓటర్లు గత మూడు ఎన్నికల్లోనూ టిడిపికి ఆధిక్యత అందిస్తున్నారు.

ఈసారి కూడా టిడిపి కే ఆధిక్యత వస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే పోలింగ్ శాతం తగ్గడంతో టిడిపి నాయకులు ఆశించిన స్థాయిలో ఆధిక్యత వుండదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా అభ్యర్థుల భవిత్యం జూన్ 4న తేలనుంది.

చర్చావేదికలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, జెవివి నాయకులు

చదువులు- కొత్తదారులపై చర్చా వేదిక

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పట్టణంలోని జట్టు ఆశ్రమంలో శుక్రవారం ప్రముఖ మానవతా వాది, జనవిజ్ఞాన వేదిక నాయకులు సిఎ ప్రసాదరావు అధ్యక్షతన చదువులు కొత్తదారులు అన్న అంశంపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ చర్చా కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు, ప్రముఖ రచయిత గంటేడ గౌరీ నాయుడు, సామాజిక కార్యకర్త సంఘ సేవకులు జట్టు పద్మజ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావుతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుణాత్మకమైన విద్యను ఏ రకంగా అందజేసి వారిని భవిష్యత్తులో ఒక మంచి దారిని ఎన్నుకొనెలా ఆసక్తికరమైన ప్రణాళిక ఉండాలని అన్నారు. దీనికి ఉపాధ్యాయులుగా మన వంతు బాధ్యతను నిర్వర్తించాలని చర్చా వేదిక లో తీర్మానించారు.

సమన్వయం పాటించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల అనంతరం జూన్ 4న ఫలితాలు వెలువడనున్న సందర్భంలో అభ్యర్థుల గెలుపోటమి పట్ల గ్రామాల్లోని ప్రజలు సమన్వయం పాటించాలని పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన చినమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ మంగరాజు, ఎస్సై చిన్నమనాయుడు ఆధ్వర్యంలో కుదమ, చినమేరంగి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరు గెలిచినా మన ఎంపి, ఎమ్మెల్యేగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని సూచొచారు. ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించి, గొడవలకు అల్లర్లకు దూరంగా ఉండాలని తెలిపారు. అంతేకాక అభ్యర్థుల గెలుపు అనంతరం ఎలాంటి ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం చేయరాదని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు ఉంటుందని, అలాగే 144 సెక్షన్ నడుస్తున్నందున మండలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు కోరారు. మండలంలోని పూడి గ్రామస్తులకు ఎన్నికల కోడ్ పై శుక్రవారం అవగాహన కల్పించారు. కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి గొడవలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత నియమాలు, ఫోక్సో, దిశా చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే నాటు సారా, గంజాయిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరులో గ్రామస్తులకు ఎస్ఐ ఎస్‌కె ఫక్రుద్దీన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామంలో బాణా సంచా కాల్చరాదని, నలుగురైదుగురు కంటే ఎక్కువగా ఉండకూడదని, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎఎస్ఐ ఆర్.రెలయ్య, హెచ్‌సి వాసునాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : కుదమలో గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

బాలగుడబలో గ్రామస్తులకు దోమ లార్వాను చూపిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

దోమల నివారణకు డ్రైడే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దోమల నివారణకు ప్రతి ఒక్కరూ డ్రైడే తప్పనిసరిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని బాలగుడబలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో, వీధుల్లో దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను ఎక్కడైనా గుర్తించారని సిబ్బంది ఆరా తీశారు. ఈ మేరకు ఆయన పరిశీలనలో నిల్వ నీరు పాత్రలో గుర్తించిన దోమల లార్వా ను అక్కడ స్థానికులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ లార్వా వృద్ధి చెంది దోమలుగా వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ తదితర జ్వరాలు, సీజనల్ రోగాలకు కారణమవుతాయని అన్నారు. ఇంటిపరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నీటి నిల్వలను గుర్తించి తొలగించడమే డ్రైడే ముఖ్యోద్దేశ్యమని అన్నారు. వైద్య, పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్రైడే-డ్రైడే వివరాలు సంబంధిత యాప్‌లో అదే రోజు ఆన్లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది రామలక్ష్మి, శ్రీధర్, జగదీష్, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని ప్రతి గిరిజన గ్రామంలో ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని అంటివలసలో జ్వరాలతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో అన్ని గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రెండేళ్లుగా గిరిజనులకు దోమతెరలు, దోమలను నివారించే మందు పిచికారి చేసే విధానాన్ని అధికారులు మర్చారని విమర్శించారు. అంటివలసలో యు వెంకటేష్ కుటుంబంలో మూడు నెలల క్రితం పాప జ్వరంతో చనిపోగా ఇప్పుడు కొడుకు సాయి తేజ, కుమార్తె అలేఖ్య మలేరియా బారినపడి ఇటీవల తేరుకున్నారన్నారు. వీరితో పాటు మరికొంతమంది గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రామస్వామి, రామారావు, సంతోషం, శేఖర్, చిన్నారావు, అప్పారావు, బలరాం, వెంకట్రావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

మంచానపడ్డ రోగిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

అభివృద్ధికి ఆమడ దూరాన పార్కులు

పట్టణంలో కరువైన ఆహ్లాదం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణం జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెంది 70 వేల జనాభాకు చేరుకున్నప్పటికీ పట్టణ ప్రజలు సేద తీర్చుకునేందుకు సరిపడా పార్కులు లేవనే చెప్పవచ్చు. బెలగాం చర్చి వీధిలో మున్సిపాలిటీ ఏర్పడిన తొలి రోజుల్లోనే డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్కును మాత్రమే అభివృద్ధి చేశారు. ఆ తర్వాత మున్సిపల్ పరిధిలో కొత్తగా ఏర్పడిన పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఇక జిల్లా కేంద్రంగా ఆవిర్భవించి రెండేళ్లు పూర్తి అయినప్పటికీ పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరంగా ఉన్నారనే చెప్పొచ్చు. పట్టణంలో పాత బస్టాండ్ దగ్గరలో ఉన్న ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న మున్సిపల్ పార్క్, ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న మున్సిపల్ పార్క్, బెలగాంలోని నారాయణ స్కూల్‌కు వెళ్లేదారిలో ఉన్న మున్సిపల్ పార్కులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత పాత బస్టాండ్ దగ్గర ఉన్న ఎస్ఎన్ఎం నగర్ పేరుతో కొందరు వ్యాపారులు మున్సిపల్ అప్రూవల్‌తో లేఅవుటును వేసి పార్క్ స్థలాన్ని చూపించారు. దీంతో ఈ పార్కు స్థలానికి అప్పటి రాష్ట్ర పర్యావరణ, చిన్న నీటి పారుదల శాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ నరసింహ ప్రియా థాట్రాజ్‌తో కలిసి రూ.5లక్షలు జన్మభూమి నిధులతో 2006 మే 29న ప్రారంభోత్సవం చేశారు. అయితే ఈ పార్కులు ప్రారంభించి నేటికి 18ఏళ్లు అయినా అభివృద్ధి నోచుకోలేదు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ఈ పార్కు పశువులకు అడ్డాగా మారింది. అలాగే గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న మున్సిపల్ పార్కింగ్ స్థలానికి నీరు చెట్టు పథకం కింద కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసి మట్టి వేయించారు. కానీ పార్కును అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ దగ్గరలో ఉన్న మున్సిపల్ పార్క్‌లో మట్టితో నింపినప్పటికీ పార్కును అభివృద్ధి చేయలేదు. ఈ పార్కులను అభివృద్ధి చేసేందుకు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని సమకూర్చేలా తమ వంతు కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎస్ఎన్ఎంనగర్ లో ఉన్న మునిసిపల్ పార్క్

బెలగాం చర్చి వీధిలో వాడుకలో ఉన్న ఉన్న డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్క్

వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న ఈశ్వరరావు

ఉపాధి పనుల వద్ద సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ పనులు చేపట్టిన చోట వేతనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, గిట్టుబాటు కూలి చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సుక్కులు, ఎర్రయ్య, దండి జానకిరామ్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ చట్టం గిరిజనులకు ఎంతో అండగా ఉందని,అయితే మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొరద ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంపట్ల గ్రామాల్లో ప్రజలకు అధికారులు అవగాహన కలిగించాలన్నారు. ఈ చట్టాన్ని ఏ విధంగా అమలు చేయాలో కూలీలకు వివరించాలన్నారు. అవినీతికి తావు లేకుండా ఉపాధి హామీ చట్టాన్ని నడిపించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పని వేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కూలీలతో పాటు రైతు సంఘం నాయకులు బోను గౌరునాయుడు, గిరిజన సంఘం నాయకులు రాజేష్, గోపాల్, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఖరీఫ్ -2024 సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పనుకువలస, పి.కోనవలస రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం సాగుభూమి ఆరోగ్యాన్ని పెంచడానికి అవసరమయ్యే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగులు 36 క్వింటాలు, కట్టెజనుము 34, పిల్లి పెసర రెండు క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం కావాల్సిన రైతులు డి-కృషిలో రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని తెలిపారు. అలాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సుమారు 1900 ఎకరాల్లో వరి పంట సాగు చేసే అవకాశం ఉన్నందున ఎంటియు 1064 విత్తనం 80 క్వింటాళ్ళు ఎంటియు 1121 రకం 180 క్వింటాళ్ళు, ఆర్‌జిఎల్ రకం 230 క్వింటాళ్ళు, సాంబమసూరి 36 క్వింటాళ్ళు, సోనామసూరి 60 క్వింటాళ్ళు, కొత్తరకం ఎంటియు 1318, ఎంటియు 1224 రకం వరి కొత్త రకాలు కూడా 50 క్వింటాళ్లు జూన్ మొదటి వారానికల్లా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అలాగే 1600 టన్నుల యూరియా, 650 టన్నుల డిఎపి, 500 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 600 టన్నుల పొటాష్ అవసరం కాగా, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో 275 టన్నుల యూరియా, 160 టన్నుల డిఎపి, 36 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే మండలంలోని ఐదు ఎరువుల షాపుల ద్వారా కూడా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకొని చిరుధాన్యాల సాగు పెంచాలనే ఉద్దేశంతో 19 క్వింటాళ్ల రాగులు, పది క్వింటాళ్ల కొర్ర విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో నవధాన్యాల పచ్చిరొట్ట విత్తనాలు ఆవశ్యకత భూసారం పెంపుదల. గడ్డిపెంపకం పత్తి నిషేధం, చిరుధాన్యాల సాగు పెంపు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు పూర్తి సంసిద్ధతతో ఉన్నామని, రైతులకు విఎఎలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ వినోద్‌కుమార్, నాగమణి పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలను నిల్వ చేస్తున్నట్టు తెలిపారు. ఎంటియు 1064 రకం వరి విత్తనాలు 1900 క్వింటాలు, స్వర్ణమసూరి 300, సాంబ మసూరి 300 క్వింటాళ్ల వరి విత్తనాలకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించామన్నారు. ఈమేరకు ఒకటి, రెండు రోజుల్లో రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలను నిల్వ చేస్తామన్నారు. వరి విత్తనాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ధర నిర్ణయించిన అనంతరం పంపిణీ ప్రారంభించామని ఎఒ విజయభారతి పేర్కొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి మండలంలో రైతులందరికీ 90 శాతం సబ్సిడీపై పలు రకాల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి సిహెచ్ ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో గిరిజన రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ మేరకు 1200 క్వింటాళ్లు వరి విత్తనాలు, 11 క్వింటాళ్లు చోడి, 3.5 క్వింటాళ్లు కొర్రలు, 65 క్వింటాళ్లు జీలుగ, 50 క్వింటాళ్లు కట్టే జనుము (పచ్చి రొట్ట విత్తనాలు) అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు ఆయన చెప్పారు.

రైతులకు అందజేస్తున్న విత్తనాలు

29న మండల సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన వెలుగు సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని పారాది సబ్ స్టేషన్ 11కెవి ఫీడర్‌లో స్తంభాలు వేయనుండడంతో సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇఇ డి.కిరణ్ కుమార్ చెప్పారు. ఎం.పనుకు వలస, కొత్తపెంట, మెట్టవలస, గున్నతోటవలస, గొర్లెసీతారాంపురం, నారాయణప్పవలస, గొల్లలపేట, ఎస్.సీతారాంపురం, రొంపల్లి, కాశిందొరవలస, అప్పలరాజుపేట గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

26న విద్యుత్ అంతరాయం

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి ఉంగరాడమెట్ట పరిసర ప్రాంతాల వారికి ఈనెల 26 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ హరి బాబు తెలిపారు.

శస్త్రచికిత్సలకు వెళ్తున్న వారితో కంటి వైద్యాధికారి నగేష్‌రెడ్డి

40 మందికి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆరోగ్య సురక్ష,కంటి వెలుగు కార్యక్రమాల్లో నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరంలో నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టెరిజియం (కొయ్యకండ) ఉన్న 40 మందిని గుర్తించి, వారికి శస్త్ర చికిత్సల కోసం శుక్రవారం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి జీరు. నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోలు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని, శస్త్ర చికిత్సలకు వెళ్తున్న వారికి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు మాలిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎఎస్‌పి

మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 576 మద్యం సీసాలు, 130.36 లీటర్ల నాటు సారాను ఎఎస్‌పి సునీల్ షరైన్, పట్టణ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తవలస శివారు ప్రాంతంలో గల తోటపల్లి పాత రోడ్డు వద్ద ధ్వంసం చేశారు. ఇందులో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

క్షేత్ర స్థాయిలో పనిచేసే ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి బకాయి వేతనాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేటి సమాజంలో మానవ అహార సంపద అంతా రసాయన కలుషితమేనని, ఈ తరుణంలో క్షేత్ర స్థాయిలో పూర్వీకులు అనుసరించిన ప్రకృతి వ్యవసాయ విధానాలను, అవలంభించే సాగు మెలుకువలను నేర్పించే ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 16 నెలలుగా తమ సేవలను వినియోగించుకొని వేతనాలు ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. వేతనాలు తక్షణమే విడుదల చేయాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దారిమల్లిలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై డిపిఎంలు ప్రకాష్, శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నవధాన్యాలు గురించి అవగాహన కల్పించారు. అలాగే చిన్న బగ్గ, దిబ్బగూడ పొలాల్లో నవధాన్యాల విత్తనాలు జల్లడం, దాని గురించి సరళీకరణ అవగాహన కల్పించారు. రైతులకు నవధాన్యాలు ఎంతెంత మోతాదులో వేయాలో తెలిపారు. రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్స్, ఎన్జీవో సిబ్బంది, వాసన ఎన్జీవో సంస్థల సిబ్బంది, జెడ్పీఎం బాలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుస్తు చర్యగా గుమ్మలక్ష్మీపురంలో పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు అన్నారు. ఇందులో గ్రామంలోని పలువీధుల్లో గల కాలువలు, బోర్లు వద్ద పూడికలు తొలగించామన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహిస్తున్నామని తెలిపారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు సోకకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

పారిశుధ్య పనులను చేయిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

చిదిమి రోడ్డు పూర్తయ్యేదెప్పుడో?

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాలకు వెళ్లే బిటి రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేదెప్పుడని మండలంలోని చిదిమి, పివిఆర్ పురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది జూలై 21న చిదిమి జంక్షన్ వద్ద రూ. కోటీ 41 లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే వి కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రహదారికి ఇరువైపులా మట్టి పనులు చేపట్టి, రోడ్డుపై 40 ఎంఎం చిప్స్ వేసి రోలింగ్ చేశారు. అనంతరం పనులు నిలిపివేశారు. దాదాపు 10 నెలలు కావస్తున్నప్పటికీ పనులు ముందుకు సాగలేదు. ఈ రోడ్డు పనులు ఉపాధి హామీ పథకం నిధులతో సీతంపేట ఐటిడిఏ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. చిదిమి గ్రామానికి బిటి రహదారి సౌకర్యం కల్పిస్తానని తనను ఎంపిపటిసిగా గెలిపించాలని ప్రస్తుతం ఎంపిపి వెంకటరమణ నాయుడు పివిఆర్‌పురం, చిదిమి, యు.వెంకంపేట, సిఎస్ఆర్ పేట గ్రామస్తులు అభ్యర్థించారు. ఆ మేరకు ఆయన్ను గెలిపించగా, ఎంపిపి అయ్యారు. అయితే రోడ్డు పనులు మాత్రం అలాగే నిలిచిపోయాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపిపి స్వగ్రామానికే రహదారి లేదంటే మండలంలో అభివృద్ధి పనులు ఏ విధంగా ఉన్నాయో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చని ప్రజలు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమే ఐటిడిఎ జెఇ నాగభూషణను ఫోనులో వివరణ కోరగా, ఆయన స్పందించలేదు.

రాళ్లు తేలిన చిదిమికివెళ్లే రోడ్డు

జలమయమైన ప్రధాన రహదారి

చిన్నపాటి వర్షానికి జలమయమైన మెయిన్‌రోడ్డు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో శుక్రవారం రాత్రి ఏడు గంటలకు కురిసిన చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారి జలమయమైంది. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రభుత్వాలు, అధికారులు మారినా రోడ్డు పరిస్థితి మారడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రమై రెండేళ్లయినా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాలువలను ఎత్తు చేయకపోవడం, పూడికలు తొలగించక పోవడంతో ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారిపై పడే వరదనీరు కాలువల్లోకి ప్రవహించేందుకు అవకాశం లేక ప్రధాన రహదారిపై నిల్వ ఉండిపోతుందని స్థానికులు చెబుతున్నారు. అలాగే పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించక పోవడం ప్రధాన కారణం అని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపక పోవడంతో ఈ సమస్య అలాగే ఉంది. రానున్న రోజుల్లో వర్షాలు ఎక్కువ కురిసే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

27న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 27న విద్యారంగంలో పరిణామాలు- సవాళు అనే అంశంపై రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని కెఎల్‌పురంలో శేషగిరి విజ్ఞాన కేంద్రం వద్ద సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 9.30 గంటలకు శేషగిరి విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లో విద్యారంగంలో పరిణామాలు - సవాళ్ళు, కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శాసనమండలి మాజీ ప్రొటెంస్పీకర్ విఠపు బాలసుబ్రమణ్యం, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి సదస్సుకు రాష్ట్ర కార్యదర్శులు, ఉత్తరాంధ్ర జిల్లాల నాయకత్వం హాజరవుతారని చెప్పారు. ఉపాధ్యాయులు అందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి.వాసుదేవరావు, సిహెచ్ తిరుపతినాయుడు, జి.రాజారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శంకరరావు, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒ పోస్టుల ఆన్‌లైన్ పరీక్షకు

1470 మంది అభ్యర్థులు

- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- డిఆర్‌ఒ అనిత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ డిఇఒల నియామకం కోసం శనివారం నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షకు అభ్యర్థులంతా అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని డిఆర్‌ఒ ఎస్.డి.అనిత చెప్పారు. పరీక్షకు 1470 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై డిఆర్‌ఒ శుక్రవారం తన ఛాంబరులో సమీక్షించారు. జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు కేంద్రంలోకి అనుమతిస్తారని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించరని స్పష్టంచేశారు. రాజాంలోని జిఎంఆర్ఐటిలో 300 మంది, చింతలవలసలోని ఎంవిజిఆర్ కళాశాలలో 250 మంది, భోగాపురం మండలంలోని అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 170 మంది, బొబ్బిలిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో 90 మంది, గాజులరేగ వద్దనున్న సీతం కళాశాలలో 150, అయాన్ డిజిటల్ జోన్‌లో 510 మంది పరీక్షకు హాజరు అవుతున్నట్టు తెలిపారు. రాజాంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థ విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఉదయం 5.30, 6 గంటలకు ప్రత్యేక బస్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అధికారులు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

బైకులు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మలక్ష్మీపురం నుంచి తాడికొండ వెళ్తున్న పత్తిక నాగేశ్వరరావు, కిల్లక సంతోష్ కోసింగి భద్ర నుంచి మురడ వెళ్తున్న కిల్లక మురళి, కిల్లక అమల బైకును ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎల్విన్ పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే చోరీ... ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు బోటు షికారు పరిసరాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. దళాయివలసకు చెందిన ఎస్.నారాయణరావు ఖడ్గవలస వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుతుండగా బోటు షికారు పరిసరాల్లో నలుగురు వ్యక్తులు ముందు నుండి ఇద్దరు, వెనుకనుండి ఇద్దరు ఒక్కసారిగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఆపి బండి తాళాలు లాక్కొన్నారు. ఆయన మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిపోయారు. ఈ హఠ పరిణామానికి గురైై నారాయణరావు కేకలు వేసినప్పటికీ ఎవరూ అందుబాటులో లేరు. అప్పటికే చోరికి పాల్పడిన నలుగురు వ్యక్తులు ఉడాయించారు. ఇదే ప్రాంతంలో పలుమార్లు చోరి జరిగిన సంఘటనలున్నాయి. ఈ మేరకు స్థానిక పోలీసులను బాధితుడు ఆశ్రయించగా నిందుతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టపగలే చోరి జరగడంతో ఈప్రాంత వాసులు సర్వత్రా భయాందోళన చెందుతున్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- బొబ్బిలి

హత్య కేసులో నిందితుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కమ్మవలసలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాలు మేరకు.. కమ్మవలస గ్రామానికి చెందిన పి.తవిటి నాయుడు ఈఏడాది ఫిబ్రవరి 20న తన భార్యపై ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేశాడు. హత్య కేసులో అరెస్టు అయిన తవిటినాయుడు బెయిల్ పై బయటకు వచ్చి పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని మృతి చెందిన తవిటినాయుడు

ఎడ్లబండి నుంచి జారిపడి బాలుడు మృతి

ప్రజాశక్తి - గజపతినగరం

ఎద్దుల బండి నుంచి జారిపడి బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన తామడ అఖిల్ (9) అతని తాతకు సంబంధించిన ఇసుకతో కూడిన ఎడ్ల బండిపై ముందు భాగంలో కూర్చుని ఉండగా ఎత్తు పల్లాలు రావడంతో బండి పై నుంచి జారిపడి చక్రాల కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను వెంటనే కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదత్ ఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన అఖిల్